# అరవింద

"నేను నీకు ముందుగానే చెప్పాను. పెద్ద పిల్లను చూట్టానికి పెళ్ళివారొచ్చినప్పుడు రెండో పిల్లను వాళ్ళముందుకు రానివ్వద్దని ఇప్పుడు అఘోరించు.." విసుగ్గా, కోపంగా అన్నాడు రాఘవేంద్ర.

"ఇలా అవుతుందని నేను కలగన్నానా? ఇంకా, చిన్నదానికన్న పెద్దదే లక్షణంగా ఉంటుంది. వాళ్ళ కళ్ళకేం మసకలు కమ్మేయో గానీ..." అక్కసుగా జవాబిచ్చింది చాముండేశ్వరి.

చూడగానే మధ్యతరగతి ఇల్లని తెలిసిపోతున్న ఇంట్లోని ముందు గదిలో జరుగుతోంది సంభాషణ.

గుమ్మం దగ్గర దిగులుగా నిలబడివుంది పావని.

పంతొమ్మిదేళ్ళ వయస్సులో, పచ్చని మేని ఛాయతో, యవ్వనపు మిస మిసలతో చూడగానే ఆకట్టుకునేంత అందంగా ఉంది.

అందానికి తోడు ఆకర్షణీయంగా అలంకరించుకుందేమో ఆరోజు మరీ మరీ చూడాలనిపించేలా ఉంది.

గులాబీ రంగు చూడీదార్ డ్రెస్ వేసి, నీలి చున్నీని ఒకవైపు అలంకారంగా వేసింది.

చెవులకు గులాబి రంగు స్టడ్స్ పెట్టింది.

జుట్టు ముందు భాగం పైకి దువ్వి నీలి బాండ్ వేసి, వెనకాల జుత్తుని దువ్వి వదిలేసింది.

కత్తిరించిన కనుబొమలూ, మస్కార దిద్దిన కను రెప్పలూ, బ్లష్ అద్దిన చెక్కిళ్ళూ చూస్తుంటే ఆకర్షణీయంగా అలంకరించుకోవడం కూడా ఒక కళ అనేట్లు మురిపిస్తున్నాయి.

అయితే ఆ పిల్ల ముఖం మాత్రం దిగులుతో చిన్నబోయింది.

తప్పు చేసినట్లుగా తల దించుకుని కూర్చున్నదల్లా అప్పుడప్పుడూ కళ్ళెత్తి గడప కవతల కూర్చున్న అక్కను చూసి చటుక్కున చూపు మరల్చుకుంటోంది.

"అయిపోయిన దాన్ని గురించి అనుకుని ఏం ప్రయోజనం జరగవలసిన పని చూడండి.. చిన్నమ్మాయి నిస్తామంటే పాతిక వేలకే చేసుకుంటార్ట." లోకం తెలిసిన మేనమామ అర్థయుక్తంగా పావని వైపు చూసేడు.

అరవింద ముఖం అటువైపు తిప్పుకుంది.

ఆ పిల్ల ముఖం అవమానంతో రోషంతో ఎఱ్ఱబడి ఉంది.

చామన చాయలో అరవింద అందం చూడగానే కనబడేది కాదు.

ఆమె నవ్వు, మాట, నడత చూసిన వారికే ఆ పిల్ల అందంలోని ఆకర్షణ కనబడుతుంది.

పక్క పాపిట తీసి క్రిందకి దువ్వి వదులుగా వేసిన జడా, చెవిలో పంజరం ఆకారంలో ఉన్న బంగారు లోలకులు బిస్కెట్ రంగు సిల్కు చీరెలో సింపుల్‌గా కనబడుతూంది.

అరవింద బి.ఎస్.సి. ఫస్ట్ క్లాసులో పాసైంది. బి.ఇడి కూడా పూర్తి చేసి ఒక ప్రైవేటు స్కూల్లో టీచరుగా పనిచేస్తూంది.

పావని బి.ఎ ఫైనలియర్లో ఉంది. మధ్య తరగతి బ్రతుకులోని ఆటుపోట్లు తెలిసి సర్దుకుపోయే తత్వం అక్కదైతే అనుకున్నదేదైనా ఎలాగైనా పొందాలనుకునే తత్వం పావనిది.

"పెద్ద పిల్లకు చేయనిదే చిన్నదానికి పెళ్ళి చేయడం కుదరదు కదా దానికి సంబంధం కుదిరేదాకా వీళ్ళు ఆగుతారా?" పరిస్థితులతో రాజీపడిపోతూ అంది చాముండేశ్వరి.

"మన శాయశక్తులా ప్రయత్నించి చూద్దాం. ఏదో సంబంధం కుదరకపోదు. దాని అదృష్టం బాగుంటే ఇద్దరికీ ఒకేసారి పెళ్ళి చేసేద్దాం. అలాకాక మన అదృష్టం బాగులేక తొందరలో సంబంధం కుదరకపోతే మాత్రం..." అర్థోక్తిలో ఆగిపోయాడు రాఘవేంద్ర.

"ఆ ఈ కాలంలో ఇంకా ఆ పట్టింపులు పెట్టుకుంటే కాదు అందాకా వస్తే అరవింద మాత్రం "చెల్లి పెళ్ళి ముందుగా చేస్తే వద్దంటుందా? బంగారంలాటి సంబంధం. పిల్లవాడు చక్కగా ఉన్నాడు. మంచి ఉద్యోగం. మళ్ళీ ఇలాంటి సంబంధం దొరకొద్దూ పావనికి?" లౌక్యంగా అటునుండి నరుక్కురావాలని చూసాడు మేనమామ.

"నా కోసమని దాని పెళ్ళి ఆపనక్కర్లేదు. దానికి నచ్చితే ముందు తనకే చేసేయండి.." నెమ్మదిగా అంది అరవింద.

"మా తల్లి మనసు బంగారం ఎవరు చేసుకుంటారో అదృష్టవంతులే. వీళ్ళకి నచ్చకపోతే వాళ్ళ... ఖర్మ" అనబోయి గభాలున ఆగిపోయి

"ఇంతకీ చిన్నమ్మాయి అదృష్టం బాగుంది. వాళ్ళంతట వాళ్ళే అడిగి చేసుకుంటా మంటున్నారు. అనక ఏం చేస్తార్లే? పిల్ల ఐస్‌క్రీంలా కనబడుతుంటే.." గర్వంగా అంటూ పావని వైపు చూసి మెటికలు విరిచింది చాముండేశ్వరి దృష్టి తగలకుండా.

పావని విసురుగా లోపలికి వెళ్ళిపోయింది.

నెమ్మదిగా లేచి వంటింట్లోకి నడిచింది అరవింద.

అయోమయంగా చూసాడు మేనమామ. "ముందు నీ కూతురుకు నచ్చాడో లేదో అబ్బాయి... అడిగి కనుక్కో..." నీరసంగా అన్నాడు రాఘవేంద్ర.

"నచ్చకేం చేస్తాడు? పాతికవేలకి ఇంత మంచి సంబంధం కాళ్ళ ముందుకు వస్తుంటే వద్దనుకోవడానికి అదేం లోకం తెలియని పసిదికాదు." లేచి పావని దగ్గరికి వెళ్తూ కూతురు వినేట్టే అంది చాముండేశ్వరి.

"అక్కయ్యేమో నీకు ముందు పెళ్ళి చేసినా తనకభ్యంతరం లేదని చెప్పేసింది. నువ్వేమిటే మాట్లాడవు?" మంచంమీద బోర్లా పడుకున్న పావని వీపు మీద చేయి వేసి అనునయంగా అడిగింది.

"వాళ్ళకిష్టమైతే నేను చేసుకోవాలా?" కోపంగా అంది పావని.

"అది కాదే తల్లీ... ఇష్టపడి చేసుకుంటామని వచ్చిన దాన్ని కాదనుకుంటే మీ నాన్న నీకోసం ఎందరి కాళ్ళు పట్టుకోవాలో... అతనికేం తక్కువ చెప్పు? ఏదో అందంగా ఉన్నావని ముచ్చటపడి కట్నం కూడా తగ్గించాడు." నచ్చజెప్పబోయింది.

"అమ్మా.. నా పెళ్ళి నా ఇష్టప్రకారం జరగాలి. నాకు నచ్చిన వాడితో జరగాలి ఇక నన్ను మాట్లాడించకు" ఖచ్చితంగా చెప్పింది.

రెండ్రోజులు ఆలోచించుకుంటే తనే మనసు మార్చుకుంటుందనుకుని అప్పటికి ఊరుకుంది చాముండేశ్వరి.

మర్నాడు సాయంత్రం ఆ ఇంట్లో మరొక రకం తుఫాను రేగింది.

తన కాబోయే భర్తను వెంటబెట్టుకుని ఇంటికి వచ్చింది పావని.

అబ్బాయి మెడికల్ రిప్రెజెంటేటివ్‌ట. ఇద్దరూ ఇష్టపడ్డారు. కులాల తేడా కూడా లేదు. వాళ్ళు ఇష్టపడినా మానినా అతన్నే పెళ్ళి చేసుకుని తీరుతానని చెప్పింది.

"హమ్మ హమ్మ... నంగనాచిలా ఉంది ఎంత పనిచేసిందీ?" గుండె బాదుకుంది చాముండేశ్వరి.

"పోనీలే కట్నం బాధ లేకుండా మొగుడిని తెచ్చుకుంది." పైకి అనకపోయినా మనసులోనే సంతోషించాడు రాఘవేంద్ర.

"నాకన్నా చిన్నది. దానికున్న చొరవ నాకు లేకపోయింది" అనుకోలేదు గానీ చెల్లెలి ధైర్యాన్ని మాత్రం మౌనంగా మెచ్చుకుంది అరవింద.

మర్నాడు రానే వచ్చాడు మధ్యవర్తి చిన్నమ్మాయి నిచ్చేమాట ఏం చెప్తారని అడగటానికి.

ఆసరికి పావని ఇచ్చిన షాక్ నుండి కోలుకున్న తల్లి తండ్రులు వినయంగా చెప్పి పంపారు 'చిన్నమ్మాయికి ముందే పెళ్ళి కుదిరింది గనుక వాళ్ళ మాట మన్నించలేమనీ, పెద్దమ్మాయిని చేసుకునేట్లయితే వాళ్ళడిగిన దానికన్న ఎక్కువగానే కట్నం ముట్టజెపుతామనీ!

నోరు మెదపకుండా జరుగుతున్నదంతా గమనిస్తూ ఉండిపోయింది పావని.

మూడోనాటికల్లా శుభవార్తతో వచ్చాడు మధ్యవర్తి.

'వాళ్ళు ఒప్పుకున్నార్ట. ముహూర్తాలు పెట్టుకోవడానిక వస్తామన్నార్ట' అంటూ.

"నేను చెప్పలేదండీ? నా బంగారు తల్లికేం. ఎక్కడ అడుగు పెడితే అక్కడ అదృష్టం కలిసొస్తుంది." చాముండేశ్వరి సంబరపడింది.

"ఇద్దరి పెళ్ళిళ్ళూ ఒకేసారి చేసేస్తున్నావు. అదృష్టమంటే నీదే" బావగారిని మెచ్చుకున్నాడు చాముండేశ్వరి తమ్ముడు.

"అక్కా... నౌ అయామ్ వెరీ హాపీ... నీకన్న ముందు నా పెళ్ళి అంటారేమో అని మధనపడ్డాను..." అక్కను కౌగిలించుకుని చెప్పింది పావని.

"ఈ సంబంధం నాకిష్టం లేదని చెప్పండి" మధ్యవర్తితోనే చెప్పింది అరవింద.

"అదేమిటమ్మా" ఆశ్చర్యపోయాడతను." అమ్మాయ్! ఏం మాట్లాడుతున్నావో ఆలోచించే మాట్లాడుతున్నావా?" మందలింపుగా అన్నాడు మేనమామ.

"ఇంత మంచి సంబంధం మళ్ళీ దొరుకుతుందటే? ఏదో వాళ్ళు మంచి మనసు చేసి మనమాట మన్నించారని మేము సంబరపడుతుంటే..." చాముండేశ్వరి కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

"అమ్మడూ... నీ కిష్టం లేకపోతే బలవంతం చేయను. కానీ నీకెందుకు ఇష్టం లేదో కారణం చెప్పు.. అబ్బాయి బాగున్నాడు. మంచి ఉద్యోగం.." రాఘవేంద్ర బాధగా అన్నాడు.

"చదువూ, ఉద్యోగం వీటన్నిటికన్న కావల్సింది మంచి వ్యక్తిత్వం నాన్నా. నన్ను చూడటానికి వచ్చాడు. నాకన్న బాగున్న చెల్లిని చూచి దాన్ని చేసుకుంటానని కట్నం తగ్గించి ఆశ పెట్టారు. ఇప్పుడు దానికి మరొక సంబంధం కుదిరిందంటే మీరిస్తానన్న మరో పది వేలతో నేను పనికివస్తానని కబురంపారు. నాకు పెళ్ళి కాకపోయినా ఫరవాలేదు గానీ అటువంటి వ్యక్తిని మాత్రం చేసుకోను" కచ్చితంగా చెప్పి లోపలికి వెళ్ళి పోయింది అరవింద.

అరవింద మాటల్లోని యదార్థం కాదనలేక ఆలోచనలో పడ్డారు మిగతావాళ్ళు.

"వనిత" మాస పత్రిక

తేది : జనవరి, 1992.